సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 22 । మార్చి । 2024




హోరాహోరీగా టెన్నిస్ పోటీలు

భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఆల్ ఇండియా సీనియర్ ర్యాకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ప్రీ క్వార్టర్ పోటీలు జరిగాయి. IIలో ▸



దొంగల ముఠా అరెస్ట్

దోపిడీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. 154 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. IIలో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సాయంత్రం)	సహరి శనివారం (ఉదయం)
భీమవరం	6.21	4.47
ఏలూరు	6.23	4.43

న్యూస్‌రీల్

వేగంగా ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ



కార్డులను పంపిణీకి సిద్ధం చేస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లాలో కొత్తగా ఓటుహక్కు కలిగిన వారితో పాటు గతంలో ఓటరు గుర్తింపు కార్డు లేని సుమారు 2 లక్షల మందికి ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో చురుగ్గా సాగుతోంది. జిల్లాలో సుమారు 14,47,509 మంది ఓటర్లు ఉండగా 2,32,977 మందికి కొత్తగా ఓటరు గుర్తింపు కార్డులు అందించాల్సి ఉంది. ఇప్పటికే మొదటి విడత 98,804 మందికి కార్డులు పోస్టు ద్వారా పంపిణీ చేయగా వారిలో 9,200 మంది చిరునామాలు లభించకపోవడంతో వారికి బీఎల్ఓల ద్వారా కార్డులు పంపిణీ చేయించారు. రెండో విడతగా ఈనెల 24లోపు 1,17,263 ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. మరో 7,710 కార్డులు ప్రింటింగ్ కావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

అర్హతలు ఉంటేనే ఓటు హక్కు



ఓటు దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

పెనుగొండ: బెంగళూరు, హైదరాబాద్‌లో ఉంటూ ఓటు నమోదుకు ఫాం–6 దరఖాస్తు చేస్తే వాటిని బీఎల్ఓలు సిఫార్సు చేయవద్దని ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏపీ పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా ఓటు నమోదుకు వచ్చిన ఫాం–6 దరఖాస్తులను గురువారం చినమల్లంలో ఆయన పరిశీలించారు. అర్హులు కాని వారు నమోదు చేసుకుంటే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. అటువంటి దరఖాస్తులకు సిఫార్సు చేస్తే సంబంధిత బీఎల్ఓపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఇంకా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉంటే తక్షణం తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

6జీ టెక్నాలజీతో బహుళ ప్రయోజనాలు

తాడేపల్లిగూడెం: రాబోయే రోజుల్లో అందుబాటులోకి వచ్చే 6జీ అడ్వాన్సు టెక్నాలజీ అని, దీని ద్వారా బహుళ ప్రయోజనాలున్నాయని ఐఐటీ తిరుపతి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ ఆర్.సర్వేంద్రనాథ్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో గురువారం విద్యార్థులకు ఇంటెలిజెంట్ రెఫ్లెక్టింగ్ సర్ఫేస్ ఎయిడెడ్ 6జీ కమ్యూనికేషన్ సిస్టమ్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 5జీ కన్నా మెరుపు వేగంతో 6జీ పనిచేస్తుందన్నారు. 6జీ కమ్యూనికేషన్లలో వర్చువల్ రియాలిటీ వంటి నూతన సాంకేతికతలను వినియోగించి మరిన్ని కమ్యూనికేషన్లను అభివృద్ధి చేయనున్నారని చెప్పారు. 6జీ సేవలను దేశంలో త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు కృషి చేస్తున్నారన్నారు. ఆచార్యులు వి.సందీప్, బి.నర్సింహారావు, ఎ.కృష్ణచైతన్య, ఈసీఈ విభాగాధిపతి ఎస్.యువరాజ్ పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ సోదాలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గురువారం విస్తృత ముద్రలు లేని తూనికపు పరికరాలు ఉపయోగిస్తున్న వ్యాపారులపై 20 కేసులు నమోదు చేసినట్లు లీగల్ మెట్రాలజీ శాఖ డిప్యూటీ కంట్రోలర్ బీవీ హరిప్రసాద్ తెలిపారు. ఏలూరు రీజియన్ జాయింట్ కంట్రోలర్ పి.సుధాకర్ ఆధ్వర్యంలో తనతో పాటు కాకినాడ జోన్ డిప్యూటీ కంట్రోలర్ ఎన్.జనార్దనరావు పర్యవేక్షణలో ఉమ్మడి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. తూనికలు, కొలతల చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతున్న, ముద్రలు లేని తూనికపు పరికరాలను ఉపయోగిస్తున్న వ్యాపారులను గుర్తించామన్నారు. ఈ మేరకు రైతు బజార్లు, కూరగాయల మార్కెట్లలో 13 కేసులు, మార్కెట్ యార్డులు, కమీషన్ ఏజెంట్లపై 6 కేసులు, ఒక ఎంఎల్ఎస్ పాయింట్‌పై మొత్తం 20 కేసులు నమోదు చేశామన్నారు. అమలాపురం, భీమవరం, రాజమహేంద్రవరం, కాకినాడ అధికారులు పాల్గొన్నారు.



యలమంచిలి మండలం వార్నిమెరకలో..



చొదిమెళ్ల రైతు భరోసా కేంద్రంలో సేవలందిస్తున్న సిబ్బంది (ఫైల్)



ఆచంట మండలం ఆచంట వేమవరంలో..

రైతుకు భరోసా



కాళ్ల మండలం సీసలిలో రైతు భరోసా కేంద్రం

ఆర్బీకేలు.. అన్నదాతకు వరాలు

- సాగులో సరికొత్త అధ్యాయం
- గ్రామాల్లోనే అన్నిరకాల సేవలు
- విత్తు నుంచి పంట విక్రయం వరకూ సాయం
- రూ.65 కోట్లతో 298 ఆర్బీకేల ఏర్పాటు



వీరవాసరం మండలం మత్స్యపురిలో..

ఇదికదా.. అభివృద్ధి

వ్యవసాయాన్ని పండగ చేయడమే లక్ష్యంగా.. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. విత్తు నుంచి పంట విక్రయం వరకూ గ్రామస్థాయిలోనే రైతులకు అండగా నిలుస్తూ సేవలందించేలా ఏర్పాట్లు చేసింది. అక్రమాలకు తావులేకుండా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులతో పాటు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పరిహారం అందించడంలో ఆర్బీకేలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. కోట్లాది రూపాయల వ్యయంతో గ్రామాల్లో ఏర్పాటైన ఆర్బీకేల వంటి ప్రభుత్వ భవనాలు అభివృద్ధికి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. – సాక్షి, భీమవరం

రైతు భరోసా సాయం
5,88,999 మందికి..
రూ. 765.81 కోట్లు

ఉచిత పంట బీమా
1,14,011 మందికి..
రూ. 217.64 కోట్లు

ఇన్‌పుట్ సబ్సిడీ
1,40,015 మందికి..
రూ. 103.47 కోట్లు

వ్యవసాయ యాంత్రీకరణ
248 కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా రూ.20.70 కోట్ల యంత్ర పరికరాల పంపిణీ

ఆర్బీకేల నిర్మాణం
253 పంచాయతీల పరిధిలో 298 భవనాల నిర్మాణం
రూ.65 కోట్ల వ్యయం
211 భవన నిర్మాణాలు పూర్తి



చొదిమెళ్ల రైతు భరోసా కేంద్రంలో కియోస్క్ యంత్రం, పరీక్షించిన మట్టి



పెనుమంట్ర మండలం ఓడూరులో..



పాలకొల్లు మండలం లంకలకోడేరులో..



అత్తిలి మండలం స్కిన్నెరపురంలో..



వీరవాసరం మండలం తోలేరులో..

జగన్‌ను మళ్లీ సీఎం చేద్దాం

పెనుమంట్ర: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేద్దామని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పిలుపునిచ్చారు. మండలంలోని ఓడూరు, నెలమూరు గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల శంఖారావ ప్రచార పాదయాత్ర నిర్వహించారు. అయా గ్రామాల్లో ప్రజలు ఆయనకు నీరాజనాలు పలికారు. సీఎం జగన్ మేలు మరువలేమని, గ్రామస్తులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతు ఉంటామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, జెడ్పీటీసీలు కర్రి గౌరీ సుభాషిణి, గుంటూరు పెద్దిరాజు, సర్పంచ్‌లు బుర్ర రవికుమార్, కుచ్చర్లపాటి పద్మావతి వెంకటపతిరాజు, వైస్ ఎంపీపీలు ఈది అనిత, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు లక్ష్మి వెంకటరామరాజు, పెనుగొండ మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పెనుగొండ లక్ష్మి, మహిళా మండల అధ్యక్షురాలు కర్రి అనురాధ, మండల పార్టీ అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు చిలుకూరి వర్మకుమార్‌రాజు పాల్గొన్నారు.



ఓడూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

రూ.50 వేలు మించి తీసుకువెళ్లరాదు

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల నియమావళిని అనుసరించి రూ.50 వేలకు మించి నగదును ప్రయాణ సమయంలో తీసుకువెళ్లకూడదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ప్రయాణ సమయంలో ఎవరూ రూ.50 వేలకు మించి నగదును తమ వద్ద ఉంచుకోకూడదని పేర్కొన్నారు. అలాగే రూ.10 వేలకు మించి విలువైన వస్తువులను కూడా ప్రయాణ సమయంలో తమతో పాటు తీసుకెళ్లకూడదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పై సూచించిన మొత్తం కంటే ఎక్కువగా తీసుకువెళ్లాల్సి వస్తే కచ్చితంతో సొమ్ములకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆధారాలతో సహా తమ వద్ద ఉంచుకుని తనిఖీ అధికారులకు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు పూర్తి అవగాహన ఉండాలని ఆయన కోరారు.

జగన్ చరిష్మాను తట్టుకోలేకే పొత్తులు

అత్తిలి: ప్రజల వద్దకు దమ్ముగా వెళ్లి ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకే ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని గుమ్మంపాడు, వరిఘేడులో జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు సీఎం జగన్ చరిష్మాను తట్టుకోలేక జనసేన, బీజేపీతో పొట్టుపెట్టుకున్నారని, ఎంత మందితో వచ్చినా ఎన్నికల్లో జగన్‌కు పట్టం కట్టడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చెందాల్సిన సొమ్ములను అప్పటి పాలకులు దోచుకున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తామో చెప్పకుండా కేవలం సీఎం జగన్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయం దగ్గర పడేకొద్దీ వైఎస్సార్‌సీపీ గ్రాఫ్ క్రమేపీ పెరుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నమ్మకం పెరిగి టీడీపీ, జనసేన పార్టీల నుంచి స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ప్రచార ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి ప్రసార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే, ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు, చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్) పర్యవేక్షిస్తుందని, మీడియా ఉల్లంఘనలు కూడా గుర్తించి చర్యలు తీసుకుంటుందన్నారు. రిజిస్టర్డ్ జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు, వారి తరఫున ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచార ప్రకటనలకు అనుమతి కోసం నిర్ణీత నమూనాలో ప్రకటన ప్రసారం చేసేందుకు 3 రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ కానటువంటి రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు వారి ప్రకటన ప్రసారం చేసేందుకు 7 రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోగా జిల్లాస్థాయి ఎంసీఎంసీ కమిటీ అనుమతి మంజూరు చేస్తుందన్నారు. వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి అనుమతి పొంది ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి అన్ని రకాల టెలివిజన్ చానళ్లు, కేబుల్ నెట్‌వర్కులు, డిజిటల్ డిస్‌ప్లేలు, మొబైల్ నెట్‌వర్క్‌ల ద్వారా ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్‌లు వస్తాయని, సామాజిక మాధ్యమాలైన (సోషల్ మీడియా) ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్, గూగుల్ వెబ్‌సైట్లు, వికీపీడియా కూడా ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయని తెలిపారు.



ప్రకటనలను పరిశీలిస్తున్న కలెక్టర్

సినిమా హాళ్లలో.. సినిమా హాళ్లలో, ప్రైవేట్ ఎఫ్ఎం రేడియోల్లో, ఎలక్ట్రానిక్ పత్రికల్లో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలు కూడా తప్పనిసరిగా ముందస్తు ధ్రువీకరణ పొందాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అనుమతి లేకుంటే కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. ఈ మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఆర్థికంగా నిలదొక్కుకున్నాం



కూలి పని, చేతి వృత్తులు చేసుకుని జీవిస్తున్నాం. జగనన్న ప్రభుత్వం మా పిల్లలకు మంచి చదువును అందిస్తోంది. నా భర్త చేబత్తిన సత్యానందం తాపీపని, కరెంటు పని, డ్రైవర్, ఇతర చేతి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా మా బాబుకు రూ.15 వేలు చొప్పున మూడేళ్ల లబ్ధి చేకూరింది. ఆసరా పథకం కింద రూ.16 వేల చొప్పున గత ఐదేళ్లుగా నా బ్యాంక్ ఖాతాలో రూ.80 వేలు జమ అయింది. జగనన్న కాలనీలో నాకు ఇంటి స్థలం ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలో మా కుటుంబం లబ్ధి పొంది ఆర్థికంగా నిలబడగలిగాం. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధనతో మా పిల్లలకు ఇంగ్లిష్, ఇతర సబ్జెక్టులు బాగా చెబుతున్నారు. సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– చేబత్తిన దేవిక, సిద్దాపురం, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా

సంక్షేమ



శకం

ఇదిగో నవరత్నాల వెలుగులు



నాభర్త ఐదేళ్ల క్రితం అవమానించి దూరం కావడంతో తండ్రి లేని నేను నాతల్లి వెంకటలక్ష్మి మీదే ఆధారపడి జీవించేదాన్ని. నేను నాకుమార్తె వనజాక్షి బతకడం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వికలాంగురాలిని కావడంతో ఏ పని చేయలేకపోయేదాన్ని. గత ప్రభుత్వంలో వికలాంగ పెన్షన్ కోసం దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. జగనన్న ప్రభుత్వంలో ఒంటరి మహిళ పెన్షన్ రూ.3 వేలు, అమ్మఒడి ద్వారా రూ.13 వేలు, కాపు నేస్తం ద్వారా రూ.15 వేలు చొప్పున చేతికందడంతో కుమార్తెతో కలిసి సంతోషంగా జీవిస్తున్నాను. జగనన్న కాలనీలో స్థలం కూడా మంజూరైంది. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధి వల్ల నా తల్లికి నా బతుకుపై బెంగ తీరింది.

– పువ్వలదాస్ ముత్తేశ్వరి, పరింపూడి, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా

మళ్లీ సీఎంగా జగనే కావాలి



నా కుటుంబానికి సీఎం వైఎస్ జగన్ ఎంతో మేలు చేశారు. నాకు ప్రతి నెలా రూ.3వే లు పింఛన్ అందుతోంది. అలాగే వైఎస్సార్ చేయూత పథకంలో రూ.18,750 నా బ్యాంక్ ఖాతాలో ఇప్పటికి నాలుగు సార్లు జమయ్యాయి. వైఎస్సార్ ఆసరా పథకంలో ఏడాదికి రూ.6 వేలు చొప్పున ఇప్పటికి మూడు సార్లు రుణమాఫీ అయ్యింది. అలాగే ఇంటి స్థలం ఇచ్చారు. నా కుటుంబానికి మేలు చేసిన సీఎం జగన్ మళ్లీ సీఎం కావాలి. ఆయనకు ఓటు వేయడానికి నేను సిద్ధం.

– కోట మేరీ, కొంతేరు, యలమంచిలి మండలం

వెంకన్న హుండీ ఆదాయం రూ.12.52 లక్షలు



కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభుః శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ కానుకలను గురువారం లెక్కించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ భీమవరం తనిఖీదారు వి.వెంకటేశ్వరరావు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి అరుణ్ కుమార్ గ్రామస్తుల సమక్షంలో హుండీ తెరిచి లెక్కించారు. 76 రోజులకు గాను రూ.12,52,839 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ అరుణ్ కుమార్ చెప్పారు.

జగన్ ప్రభుత్వంలో మేలు జరిగితేనే ఓటెయ్యండి

- నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి
- చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు
- నరసాపురంలో ఎన్నికల ప్రచారం ప్రారంభం



నరసాపురం 26వ వార్డులో ప్రచారం చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు గురువారం పట్టణంలోని 26వ వార్డు వైఎస్సార్ నగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముదునూరికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇంటింటికీ తిరిగి ఐదేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రతి కుంటుంబానికి నవరత్నాల పథకంలో భాగంగా కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషిచేశానని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున సాగాయని చెప్పారు. కుటుంబంలో మంచి జరిగితేనే ఓటు వేయమని తమ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెబుతున్నారని అన్నారు. తాను కూడా నియోజకవర్గ ప్రజలకు అదే చెబుతూ మరోసారి ఆశీర్వదించమని కోరుతున్నానని అన్నారు.

రాష్ట్రంలోనే నరసాపురంలో ఎక్కువ అభివృద్ధి

నియోజకవర్గంలో రాష్ట్రంలోనే ఎక్కువ మొత్తంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని ముదునూరి వివరించారు. దేశంలో మూడో ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటు, వశిష్ట వంతెన టెండర్ దశలో ఉందన్నారు. బియ్యపుతిప్ప ఫిషింగ్‌హార్బర్ పనులు ప్రారంభమయ్యాయని, రూ.5 కోట్లతో బస్టాండ్ అభివృద్ధి, రూ.13 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం చేశామన్నారు. కాళీపట్నం జమిందారీ భూములు, దర్బరేవు కంపెనీ భూముల సమస్య పరిష్కరించి రైతులకు మేలు చేశామన్నారు.

పేదలకు జరిగిన మేలు చూసి ఓర్వలేక

ప్రతిపక్షాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పేదలకు జరుగుతున్న మేలును చూసి ఓర్వలేకపోతున్నాయని ప్రసాదరాజు విమర్శించారు. పేదలకు మేలు జరగక్కూడదు, జగన్ సీఎం కాకూడదనే లక్ష్యంతో టీడీపీ, జనసేన, బీజేపీ జతకట్టి వస్తున్నాయన్నారు. కుట్ర రాజకీయాలను తిప్పికొట్టి, మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ మావూరి సత్యనారాయణ, సీనియర్ నేతలు కౌన్సిలర్లు వైకేఎస్, జిల్లెళ్ల దిలీప్, సిర్రా కాంతమ్మ, కావలి నాని, ద్వారా ప్రసాద్, అడిదల శరత్, సోమరాజు భరత్, కేసరి గంగరాజు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు భూసరపు జయ, దొంగ మురళీకృష్ణ, ముసూడి రత్నం, కాకిలేటి ఆనంద్, పాలపర్తి బోస్, జక్కరయ్య పాల్గొన్నారు.

భీమవరంలో హోరాహోరీగా టెన్నిస్ పోటీలు



35+ విభాగం పోటీలో తలపడుతున్న ఎన్‌డీ విజయ్ ఆనంద్

భీమవరం: భీమవరంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం నిర్వహించిన ప్రీ క్వార్టర్ ఫైనల్స్ వివరాలిలా ఉన్నాయి.

35+ విభాగంలో : ఇ.మునస్వామిపై ఎన్‌డీ విజయ్ ఆనంద్ 0-6, 0-6తో విజయం సాధించగా, డాక్టర్ కిరణ్‌పై విజయ్ వర్మ 2-6, 2-6 స్కోర్‌తో, డాక్టర్ జాన్ రెజినాల్డ్‌పై కలైమణి 4-6, 6-4, 6-10 స్కోర్‌తో గెలుపొందారు.

45+ విభాగంలో : జీవీ రమణపై బీఎల్ శ్రీనివాసరావు 6-4, 6-7, 6-10 స్కోర్‌తో గెలుపొందగా, శంకర నాయుడుపై కేవీఎస్ మూర్తి 0-6, 4-6 స్కోర్‌తో విజయం సాధించారు.

55+ విభాగంలో : ఎం.శేఖర్‌పై సి.ముని కృష్ణరెడ్డి 1-6, 2-6 స్కోర్‌తో విజయం సాధించారు.

65+ విభాగంలో: జి.చంద్రశేఖర్‌పై వి.ధనుంజయులు 3-6, 3-6 స్కోర్‌తో, ఎస్.మన్మథరావుపై జీవీ సన్యాసిరాజు 4-6, 4-6 స్కోర్‌తో గెలుపొందారు.

70+ : ఎస్ఎన్ రాజుపై డి.ఎల్లప్ప 4-6, 4-6 స్కోర్‌తో విజయం సాధించారు.

ఆసరా డబ్బు జమ చేస్తానని మోసం

కుక్కునూరు: వైఎస్సార్ ఆసరా డబ్బులు ఖాతాలో జమచేస్తానని చెప్పి ఫోన్ పే ద్వారా ఓ మహిళ బ్యాంక్ ఖాతా నుంచి రూ.82 వేలు కాజేశాడు ఓ మోసగాడు. వివరాలిలా ఉన్నాయి. ఉప్పేరు సచివాలయ పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేష్‌కు బుధవారం ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను జిల్లా ప్రభుత్వ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నానని, ఆసరా డబ్బులు జమకాని వారికి ఖాతాలో డబ్బులు జమచేస్తున్నామని నమ్మబలికాడు. డబ్బులు ఖాతాలో జమకాని మహిళలకు సంబంధించి ఫోన్‌పే నంబర్లు ఇస్తే ఖాతాలో డబ్బులు జమచేస్తామన్నాడు. అతని మాటలు నమ్మిన సదరు వలంటీర్ ఆసరా డబ్బులు జమకాని మహిళల వివరాలను ఆ వ్యక్తికి చెప్పాడు. అంతేకాక పల్లం సంధ్య అనే మహిళకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో సదరు మహిళ నిజమేనని నమ్మింది. సైబర్ మాయగాడు మహిళకు ఫోన్ చేసి ఫోన్‌పేకు ఆసరా అమౌంట్ రూ.18 వేలు మెసేజ్ చేశానని అందులో పే అప్షన్ నొక్కితే డబ్బులు మీ ఖాతాలో జమవుతాయంటూ చెప్పాడు. నిజమేనని నమ్మిన మహిళ పే అప్షన్ నొక్కింది. ఒక నిమిషంలోనే పే అప్షన్ నొక్కాలంటూ ఆ మహిళతో ఐదు సార్లు పే అప్షన్ నొక్కించి ఆమె ఖాతా నుంచి రూ.83 వేలు కాజేశాడు. ఖాతా నుంచి డబ్బు మొత్తం డ్రా అయినట్టు బ్యాంక్ నుంచి మెసేజ్ రావడంతో ఖంగుతిన్న మహిళ సైబర్ క్రైం పోలీసులకు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌పై పోక్సో కేసు

కామవరపుకోట: మనవరాలి వయసున్న ఓ బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన దేవదాయ శాఖ అధికారిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బైపీసీడి లక్ష్మీనరసింహారావు తడికలపూడిలోని గంగేశ్వరస్వామి ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఓ బాలికను లైంగికంగా వేధిస్తున్నాడు. బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు తెలపగా, గురువారం బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జయబాబు నిందితుడు నరసింహారావును అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

జగనన్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి
- బాడవలో ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం



బాడవలో పాతపాటి వాసురాజుతో కలిసి ప్రచారం చేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలే తనకు శ్రీరామరక్షగా నిలుస్తాయని పాలకొల్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. బాడవ గ్రామంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గోపికి స్థానిక మహిళల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభించింది. హారతులతో స్వాగతం పలికి ఫ్యాన్‌కు ఓటేస్తామని ముక్తకంఠంతో చెప్పారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా అమలు చేసిన పథకాలతో ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారన్నారు. ఈసారి మరిన్ని పథకాలతో ప్రజాదరణ పొందుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇలపకుర్తి లక్ష్మీ నరసింహారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వినుకొండ చిన్న, ఏనుగువానిలంక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ రావూరి రామకృష్ణ, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పాతపాటి వాసురాజు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వినుకొండ రవి, ఉచ్చుల స్టాలిన్, విప్పర్తి నవీన్, వల్లభు నరసింహారావు, గుబ్బల వేణు, చిలుకూరి సుబ్బారావు, అనిశెట్టి మల్లిక, డేగల సూర్యప్రభ, మద్దా చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

- వేర్వేరు కేసుల్లో ఐదుగురి అరెస్టు
- 154 గ్రాముల బంగారం, రెండు బైక్స్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మూర్తి



నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మూర్తి

తణుకు : దారి దోపిడీలకు పాల్పడుతున్న దొంగల ముఠా సభ్యులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ పరిధిలోని తాడేపల్లిగూడెం టౌన్, రూరల్ పోలీసు స్టేషన్లతో పాటు తణుకు టౌన్, రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలో ఇటీవల జరిగిన దోపిడీలకు సంబంధించి మొత్తం ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 154 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన గనసాల దుర్గాప్రసాద్, తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన లకనవరపు వెంకటాచారి, గణపవరం మండలం గరగ శివకృష్ణ, పంజా శ్రీనివాసరావు, ఉంగుటూరు మండలం అక్కుపల్లిగోపవరం గ్రామానికి చెందిన ఆకుల రమేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి తణుకులో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. తాడేపల్లిగూడెం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో యాగర్లపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీలో తాళం వేసి ఉన్న ఇళ్లల్లోకి చొరబడిన గనసాల దుర్గాప్రసాద్, లకనవరపు వెంకటాచారి 90 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వేర్వేరు ఘటనలకు సంబంధించి ఎస్సై జేవీఎస్ ప్రసాద్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తణుకు పట్టణ పరిధిలోని వృద్ధుడిని మోటారు సైకిల్ ఎక్కించుకుని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అతని నుంచి నాలుగు గ్రాముల బంగారు ఉంగరం, ఇదే తరహాలో తాడేపల్లిగూడెం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనంలో 20 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. రెండు కేసుల్లో నిందితులు గరగ శివకృష్ణ, పంజా శ్రీనివాసరావులుగా పోలీసులు గుర్తించి ఎస్సై కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ఘటనల్లో లిఫ్ట్ ఇస్తానని చెప్పి మాయమాటలు చెప్పి మోటారు సైకిల్‌పై తీసికెళ్లి వారి వద్ద 40 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి ఆకుల రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుల్లో ఐదురుగు వ్యక్తులను అరెస్టు చేసి సుమారు రూ.12 లక్షల విలువైన 154 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మూర్తి వెల్లడించారు. తణుకు పట్టణ, రూరల్ సీఐలు నాగరాజు, నాగేశ్వరరావు, తాడేపల్లిగూడెం సీఐ సూర్యనారాయణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా వెంకన్న



జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా పంతగాని వెంకన్నను నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన పంతగాని వెంకన్న గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేశారు. ఈ సందర్భంగా పంతగాని వెంకన్న మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనకు ఈ అవకాశం రావడానికి కారకులైన ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని, చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి కంభం విజయరాజు, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కృతజ్ఞతలు తెలిపారు. మరోసారి వైఎస్ జగన్‌ను సీఎం చేసేందుకు కృషి చేస్తానని వెంకన్న తెలిపారు. పలువురు పార్టీ నాయకులు వెంకన్నకు అభినందనలు తెలిపారు.

ఏప్రిల్ నుంచి దాళ్వా ధాన్యం కొనుగోళ్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, వేదికపై జేసీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం: దాళ్వా ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేసేలా కార్యచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో దాళ్వా ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందించి ధాన్యం సేకరించాలన్నారు. రబీ పంటలో 9.45 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి అంచనాకాగా, 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు 1.80 కోట్ల గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. సాధారణ ఎన్నికల విధులు, ధాన్యం సేకరణ పనులను సమాంతరంగా నిర్వర్తించాలన్నారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్లు, అధికారులు మధ్య అనుసంధానం అత్యంత కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం మండల స్థాయి సేకరణ కమిటీలను, 211 పెద్ద, చిన్న రైసు మిల్లులను గుర్తించి వాటికి కస్టోడీయన్ అధికారులను నియమించినట్లు చెప్పారు. సేకరణ లక్ష్యాలను సాధించడానికి హమాలీలతో పాటు 2,600 వాహనాలను సిద్ధం చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపు ర్యాండమైజేషన్ ద్వారా చేపట్టాలని టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్ల నియామకం చేసుకుని ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి శిక్షణ పూర్తి చేసి, ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేయాలన్నారు. గడిచిన సార్వాసీజన్‌కు సంబంధించి ఇంకా 8 శాతం సీఎంఆర్ రావాల్సి ఉన్నందున త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డీఎస్‌వో ఎస్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఎఫ్‌సీఐ మేనేజర్ రంజిత్‌కుమార్, జిల్లా రవాణా శాఖాధికారి టి.ఉమామహేశ్వరరావు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, జిల్లా తూనికలు, కొలతల శాఖాధికారి వీవీ నాగరాజు, ఏఎస్‌వో ఎం.రవిశంకర్, సివిల్ సప్లయిస్ సహాయ మేనేజర్ పీడీఎస్ సత్యనారాయణ, జిల్లా రైసు మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ నర్సింహారావు, సంయుక్త కార్యదర్శులు పి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

కట్నం వేధింపులు.. నలుగురిపై కేసు నమోదు

పాలకోడేరు: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఒక వివాహిత పోలీసులను ఆశ్రయించింది. రామచంద్రపురానికి చెందిన దుర్గాభవానికి వేండ్రకు చెందిన మల్లుల పవన్‌కుమార్‌తో 2021లో పెళ్లి జరిగింది. ఆ సమయంలో రూ.15 లక్షల నగదు కట్నంగా ఇచ్చారు. అదనంగా తీసుకురావాలంటూ వేధిస్తున్నారని దుర్గాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామ, ఆడపడుచులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు గురువారం చెప్పారు.

పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచాం

- అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ సమప్రాధాన్యం ఇచ్చారు
- రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌ను సీఎం చేయాలి
- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


అత్తిలి మండలం గుమ్మంపాడులో వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచి, మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించి, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రజలను కోరారు. గురువారం అత్తిలి మండలం గుమ్మంపాడు, వరిఘేడు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కారుమూరి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి పార్టీనాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో అమలు చేయని విధంగా మనరాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంతో ప్రజల ఆర్థికాభివృద్ధి సాధించారని చెప్పారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికలకు సమయం ఆసన్నమైందని, ఈరెండు నెలలుపాటు పార్టీనాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గుమ్మంపాడు గ్రామంలో రూ. 14.5 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చుచేస్తే, గత టీడీపీ ప్రభుత్వం కేవలం కోటిన్నర మాత్రమే వెచ్చించిందన్నారు. ప్రజల డబ్బును గాదెకాడ పందెకొక్కుల్లా టీడీపీ నాయకులు దోచుకుతిన్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సందర్భంగా ఇంటింటికి మూడు కండువాలు వేసుకుని వచ్చి ఓట్లు అడగడానికి వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మవద్దని హితవు పలికారు. వైఎస్సార్ సీపీప్రభుత్వం మళ్లీ ఏర్పడిన తర్వాత మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడానికి జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా పనిచేసి, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గుమ్మంపాడు గ్రామానికి గానీ, తమపార్టీకి గాని చెందని ఒక వ్యక్తిని టీడీపీ చేర్చుకుని వైఎస్సార్‌సీపీ గ్రామ ఇన్‌చార్జ్ టీడీపీలో చేరాడని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అసత్య ప్రచారం చేయడం సిగ్గుమాలని చర్యఅని కారుమూరి పేర్కొన్నారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, సర్పంచ్‌లు వేగేశ్న ధనసత్యనారాయణరాజు, పంపన సత్యవతి, ఉప సర్పంచ్‌లు రావూరి వెంకటేశ్వరరావు, అడ్డాల రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు అద్దంకి శ్రీను, అనిశెట్టి త్రిమూర్తులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు నేటపాటి సుబ్బయ్య, యాళ్ల సాధు సుందర్‌సింగ్, రాజేష్, పెచ్చెట్టిరాము, గూనా సరయ్యనాయుడు, కోరుకొల్లు వెంకట్రావు, రంభ సూరిబాబు, సబ్బితిరాజేష్, గంటా నాగరాజు, మద్దాల శ్రీనివాస్, కంకటాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ అభయం లియో సేవలు అభినందనీయం


అంగన్‌వాడీ పిల్లలకు స్నాక్స్ అందజేస్తున్న లియో సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో లయన్స్‌క్లబ్ అభయం లియో సేవలు అభినందనీయమని, యువత సేవా రంగంలో ముందు ఉందని లయన్స్‌క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు కొనియాడారు. లియో ఆధ్వర్యంలో గురువారం ప్రేమాలయం వృద్ధులకు బ్రెడ్‌లు, బిస్కెట్స్, అంగన్‌వాడీ స్కూల్ విద్యార్థులకు బిస్కెట్లు, స్నాక్స్ అందజేశారు. అనంతరం కడకట్లలోని షిర్డిసాయి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాధురి, సాయి కృతి, అమృత, శివ తదితరులు పాల్గొన్నారు.

హృదయాలను స్పందింపజేసేది కవిత్వం

తణుకు టౌన్: ఎదుట వారి హృదయాలను స్పందింపజేసే అక్షరాల క్రమమే కవిత్వమని సాహితీ సామ్రాజ్యం సాహిత్య సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. ప్రపంచ కవిత్వ దినోత్సవం సందర్భంగా తణుకులోని మారుతీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వం మనిషిలో సంతోషాన్ని, ఆనందాన్ని ఆలోచనలను పెంచుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి ప్రకాష్ బాబు మాట్లాడుతూ పలు కవితల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నాకు నచ్చిన కవిత అనే శీర్షికపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఆర్‌వీ నాగరాజు, దాసరి వీరభద్రరావు, మద్దాల త్రిమూర్తి, ఎండీ ఆలంగీర్ బాషా, ఎం మోహనరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


వృత్తి నైపుణ్య ఉచిత శిక్షణకు దరఖాస్తు స్వీకరణ

ఆకివీడు: వృత్తి నైపుణ్య ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండలంలోని దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు సువర్ణావకాశం కల్పిస్తూ నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డేటా ఎంట్రీ కోర్సు, టైలరింగ్‌లో మహిళలకు 3 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి అయిన అనంతరం ప్రభుత్వం గుర్తింపుతో సర్టిఫికెట్ అందజేస్తారని చెప్పారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాళీపట్నం తూర్పు, కేపీ పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారి పాలెం, పాలకమ్మచెరువు, శేరేపాలెం గ్రామా ల్లో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గురువారం మండలంలోని కాళీపట్నం తూర్పులో చేపట్టిన పంటబోదె పనులతో పాటు కూలీల మస్టర్లను జేఈ ఆనంద్ ఉపాధి కూలీలకు పలు సూచనలు చేశారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు


క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ కె.సుజాత

ఆకివీడు: ముందు జాగ్రత్త చర్యలతో క్యాన్సర్‌ను నివారించవచ్చునని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని బోస్ కాలనీలో ఎన్ఎస్ఎస్ శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో అధికంగా గర్భసంచి, బ్రెస్టు, బ్లడ్, గొంతు క్యాన్సర్‌లు వస్తాయని వివరించారు. పరిశుభ్రతతో, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. కెమిస్ట్రీ అధ్యాపకురాలు ఏ.ఇందిర మాట్లాడుతూ క్యాన్సర్ కు మందులేదని, నివారణే మార్గమన్నారు. క్యాన్సర్ లక్షణాల్ని గుర్తించి వెంటనే వైద్యం పొందాలన్నారు. క్యాన్సర్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే ప్రాణాపాయం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పీ.అనిల్ సాయి, ఎన్ఎస్ఎస్.కోఆర్డినేటర్ కె.ఆనందకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రథోత్సవాలు

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక గ్రామంలో పార్వతీ మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి ఆలయ అర్చకులు కామలింగశాస్త్రి, సురేంద్రశర్మ బ్రహ్మత్వంలో దేవేరులకు కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కాకుమల్ల ఆంజనేయులు దంపతులు పార్వతీ మల్లేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం గురువారం రథోత్సవం నిర్వహించారు. శివాలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం గ్రామ ప్రధాన వీధుల మీదుగా మళ్లీ శివాలయానికి చేరుకుంది.

ఎరువుల దుకాణంలో తనిఖీలు


జగన్నాథపురం పురుగు మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో లక్ష్మీగణపతి ఫెర్టిలైజర్, ఫెస్టిసైడ్ దుకాణంపై గురువారం విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.26,544లు విలువైన 4.14 మెట్రిక్ టన్నుల ఎరువుల వ్యత్యాసం గుర్తించారు. అలాగే సర్టిఫికెట్ లేని రెండు కంపెనీలకు సంబంధించి రూ.1,91,808లు విలువైన 612కిలోల పురుగు మందులను గుర్తించి అమ్మకాలను నిలుపుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్. ప్రసాద్ తెలిపారు. సెక్షన్ 6(ఎ) కింద కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్సై సీహెచ్.రంజిత్‌కుమార్, విజిలెన్స్ ఏవో పీ.సురేష్, ఏవో ఆర్ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

దువ్వలో వేణుగోపాలస్వామి పొన్న వాహనోత్సవం


దువ్వ వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: మండలంలోని దువ్వ గ్రామంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి పొన్నవాహనోత్సవం నిర్వహించారు. గురువారం రాత్రి ఆలయం ఆవరణలో జరిగిన పొన్న వాహనోత్సవ కార్యక్రమంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో మంత్రి కారుమూరి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలను బహూకరించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఆలయ కమిటీ చైర్మన్, ఈవో పీ సూర్యనారాయణ, కమిటీ సభ్యులు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలి


వేల్పూరులో బూత్ కమిటీ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు టౌన్: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి యువత కృషి చేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు కోరారు. గురువారం రాత్రి తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన యూత్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తణుకు ఎమ్మెల్యే కారుమూరి వెంకట నాగేశ్వరరావు విజయానికి తమ శక్తిమేరకు పని చేస్తామని హామీ ఇచ్చినట్లు వీర్రాజు తెలిపారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలను గురించి వేల్పూరు యువతకు వివరించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు చుండ్రు శ్యామల, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరమల్ల ఫణీంద్ర, మండల యూత్ అధ్యక్షుడు రెడ్డి మణికంఠ, పట్టణ అధ్యక్షుడు చేసెట్టి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ముద్దాపురంలో బూత్ కమిటీల సమావేశం....

రాబోయే ఎన్నికల్లో గ్రామాల్లోని బూత్ కమిటీలే క్రియాశీలకమని జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణ దేవి చెప్పారు. గురువారం రాత్రి తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామంలో నిర్వహించిన 19,20 బూత్ కమిటీల సమావేశానికి మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ బూత్ కమిటీలు నిర్వహించాల్సిన భాద్యతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మగంటి నాగ సత్యనారాయణ, నాయకులు ముళ్లపూడి బాబూరావు, వెలగన చిన్న సూరన్న, గారపాటి రామారావు, గుమ్మడి విజయ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ సి.శ్రీనివాస్ మూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ సి.శ్రీనివాస్ మూర్తి (విశాఖపట్నం) సూచించారు. పట్టణంలోని జువ్వలపాలెం విద్యుత్ డివిజనల్ ఈఈ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు జరుగుతున్నందున ఎటువంటి ఆటంకాలు లేకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు నివారించాలని చెప్పారు. రానున్న వేసవి కాలంలోను, ఎలక్షన్స్ జరుగుతున్నందున ఆ సమయంలో కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా ఉండేందుకు వీలుగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలు నరకాలని, లైన్ లాస్‌లను నివారించాలన్నారు. సమ్మర్‌యాక్షన్ ప్లాన్ పనులు పూర్తి చేయాలని, లోడ్ రిలీఫ్‌లు వంటి అంశాలపై చర్చించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని చెప్పారు. వినియోగదారుల కొత్త సర్వీస్‌లు విషయంలో ఆలస్యం చేయకుండా సకాలంలో మీటర్లు రిలీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. వినియోగాదారులకు విద్యుత్ సమస్యలు, అంతరాయాలు వస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఈఈలు ఆకుల సతీష్, బి.రామకృష్ణ, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి


భవిత కేంద్రంలో దివ్యాంగులకు విద్యా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డేను గురువారం స్థానిక భవిత కేంద్రంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షుడు పొన్నగంటి స్వర్ణ కాంతి అధ్యక్షతన నిర్వహించారు. డౌన్ సిండ్రోమ్ వల్ల పిల్లలు మ్యూజిక్ ఇష్టపడతారని చెప్పారు. చిన్న వయస్సులో వారిలో లోపాన్ని గుర్తించి, ప్రత్యేక శిక్షణ ఇస్తే వారు అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా దివ్యాంగుల విద్యార్థులకు ఆటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. డ్రాయింగ్ బుక్స్, కలర్ పెన్సిల్స్, స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మహాలక్ష్మి, భవిత ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, సెక్రటరీ కె.ప్రభ, కోశాధికారి పి.సత్య కోటేశ్వర రావు, అచ్యుత లక్ష్మి, వాసవి క్లబ్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఉద్యోగులుగా గుర్తించాలి


మాట్లాడుతున్న బి.సోమయ్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఉద్యోగులుగా గుర్తించాలని మునిసిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జిల్లా కార్యదర్శి అధ్యక్షతన గురువారం యూనియన్ 38వ వార్షికోత్సవం జరిగింది. యూనియన్ రిపోర్టును కార్యదర్శి ధనాల దానయ్య ప్రవేశపెట్టారు. వక్తలు మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యూటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. నూతన కమిటీని ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కొడమంచిలి బాబు, ప్రధాన కార్యదర్శిగా జగ్గు రాము, జాయింట్ సెక్రటరీగా ఆర్‌పీ సింగ్, కోశాధికారి కోరశిఖ సుబ్బారావు, మరో ఆరుగురు కమిటీ సభ్యులుగా ఎన్నిక చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ముదునూరు వైద్యాధికారిణి డాక్టర్ పూజిత

పెంటపాడు: సమాజ ఆరోగ్యం పట్ల విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజల్లో అవగాహన కల్పించాలని ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పూజిత పేర్కొన్నారు. ఆకుతీగపాడు గ్రామంలో పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో గురువారం ఆమె విద్యార్థులతో స్థానిక సచివాలయం వద్ద సమావేశమై ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మహిళల ఆరోగ్య సమస్యలు, చిన్నతనంలో పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల వచ్చే అనర్థాలు, పోషకాహార లోపం, సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ సోకితే తీసుకోవాల్సిన చర్యలు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయబాబు, కమిటీ సభ్యులు సురేంద్ర బాబు, రామచంద్రుడు, కళాశాల సిబ్బందితో పాటు, గ్రామ సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

తణుకు టౌన్: పట్టణంలో బ్యాంక్ కాలనీలో గల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ నెట్‌వర్క్ ఫౌండేషన్ సహకారంతో ఐదుగురు దివ్యాంగులకు వీల్ చైర్‌లు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. గురువారం తణుకు బ్యాంక్ కాలనీలో గల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, రమ చేతుల మీదుగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. తణుకులో సీనియర్ సీటిజన్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఇండియన్ నెట్‌వర్క్ సంస్థ రూ. 5 లక్షలు విరాళం అందజేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. తొలి విడతగా రూ. 1లక్ష చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శులు ఎస్ చలపతిరావు, శిరిగినీడి రామకృష్ణారావు, సభ్యులు నాదెళ్ల కృష్ణానందం, సత్యనారాయణ, వడ్లమూడి పార్వతి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

24న అలంపురానికి నరాల వైద్యుల రాక

పెంటపాడు: మండలంలోని అలంపురం గ్రామంలో వెంకటరమణ సేవా ట్రస్టు ఆసుపత్రికి విజయవాడకు చెందిన న్యూరో కన్సల్‌టెంట్ డాక్టర్ తీగల రమేష్ ఈనెల 24న రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. తల, మెదడు, వెన్నెముక, నరాలకు సంబంధించి సమస్యలను పరిష్కారానికి ఈ శిబిరాన్ని తప్పక వినియోగించుకోవాలని సూచించారు. దీంతో పాటు గుండె ఆరోగ్యానికి అవసరమైనవారికి ఈసీజీ, 2డి ఈకో, పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.

దళిత సమస్యలపై వినతి

భీమవరం: భీమవరం పట్టణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి మెట్లతోపాటు విద్యుత్ అలంకరణ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్‌ను కోరినట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు చెప్పారు. ఈ సందర్భంగా విజయవాడలో విక్టర్‌ప్రసాద్‌ను జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ కలసి ఈ మేరకు వినతిపత్రం అందజేశామన్నారు. అలాగే పెంటపాడు మండలం ఆకుతీగపాడులోని స్మశాన వాటిక ఆక్రమణకు గురైందని, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదని గ్రామ సర్పంచ్, కార్యదర్శి దళితులను వివక్షకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

నరసాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ కె.గోవిందరాజు, ఎస్సై గుర్రయ్య అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా లిఖితపూడి, సరిపల్లి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. సరిపల్లి గ్రామ సెంటర్ నుంచి ప్రధాన రహదారి మీదుగా ఈ పోలీసు కవాతు కొనసాగింది.

డ్రైడే, ఫ్రైడేతో పరిసరాల పరిశుభ్రత

- పరిశుభ్రతకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి
- దోమల వ్యాప్తి నివారణే లక్ష్యంగా ప్రతి గడపను జల్లెడ పడుతున్న అధికార యంత్రాంగం


తణుకులో డ్రైడే ఫ్రైడేపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

తణుకు అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే ప్రధాన లక్ష్యంగా డ్రైడే ఫ్రైడే కార్యక్రమం పనిచేస్తుంది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే పలు వ్యాధులను నిరోధించుకోవచ్చనే విషయాన్ని ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ప్రజలకు తెలియజేస్తున్నారు. పరిశుభ్రత విషయంలో ప్రజలను అప్రమత్తం చేసి తగు చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చనే విషయాన్ని తెలియపరిచే కరపత్రాలను సైతం పంచుతున్నారు.


దోమ పుట్టుకను నివారించాలి..

దోమ పుట్టుకను నివారిస్తే వ్యాధులు దరిచేరవని వైద్యాధికారులు చెబుతున్నారు. దోమ కాటు ద్వారా మలేరియా డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధి వంటి ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమిస్తాయి. ముఖ్యంగా దోమల వ్యాప్తిని నివారిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పట్టణ, గ్రామాల్లోను అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా నిర్ధారించి వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్త చెదారాలను తొలగింపచేయడంతో పాటు మొక్కల కుండీలు, రుబ్బురోళ్లు, రిఫ్రిజరేటర్లలో ఉన్న నీటి నిల్వలను తొలగింపచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. దోమల వ్యాప్తి నివారణలో భాగంగా కదలిక లేని నీటినిల్వలపై దోమలు లార్వా విడిచిపెడతాయని ఆ లార్వా 8 నుంచి 10 రోజులలోపు గుడ్డుగా మారి తద్వారా దోమగా రూపాంతరం చెందుతుందని ప్రజలకు వివరిస్తున్నారు. ఈ క్రమంలో వారానికోరోజు ఇంటి పరిసరాల్లో డ్రైడేగా పాటిస్తే దోమలను అరికట్టవచ్చనేది డ్రైడే ఫ్రైడే ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సంయుక్త ఆధ్వర్యంలో గ్రామాల్లో పరిశుభ్రతతోపాటు అనవసర నీటినిల్వలపై జల్లెడ పడుతున్నారు. ఈ రకంగా అధికార యంత్రాంగం నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజలు పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని నిరోధించగలుగుతున్నారు.

దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

- దోమ పుట్టనివ్వకూడదు, కుట్టనివ్వకూడదు.
- ఇంటి కిటికీలు, తలుపులు, లెట్రిన్ పైపునకు మెష్ ఏర్పాటు చేయాలి.
- దోమ తెరల్లో నిద్రించాలి.
- సాయంత్రం నుంచి శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వేసుకోవాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- తాగునీటి నిల్వలపై మూతలు వేయాలి.
- వాడుకలోలేని సామాగ్రిని బోర్లించి ఉంచాలి.
- వారానికోసారి ఇంటి పరిసరాల్లోని వాడకం కోసం ఉంచిన నీటి నిల్వలను మార్చుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు ఉంటే వేస్ట్ ఆయిల్, కిరోసిన్ పోయాలి.
- ఇంటి పరిసరాల్లో టైర్లు, తాగిపారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు లేకుండా చూడాలి.
- ఇంటి ఆవరణలో దోమ వికర్షణాలై బంతి, తులసి, పుదీనా, లావెండర్, రోజ్‌మేరీ వంటి మొక్కలు పెంచుకోవాలి.

పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా మలేరియా అధికారి సూచనల మేరకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమాలద్వారా ప్రజల ఇంటిగుమ్మంలోకే వెళ్తున్నాం. డ్రైడేగా పాటించడంవలన దోమ పుట్టుకను పూర్తిగా నివారించవచ్చు. వ్యాధులు ప్రబలే తీరు, నివారణ పద్ధతులను కరపత్రాల రూపంలో ప్రజలకు తెలియచేస్తున్నాం. ప్రజలు కూడా చైతన్యవంతులై పరిసరాల పరిశుభ్రతకు సహకరిస్తున్నారు.

– గుడిమెట్ల వెంకటేశ్వరరావు, సబ్ యూనిట్ ఆఫీసర్, తణుకు